సాక్షి కుమురం భీం

సోమవారం । 24 । జూన్ । 2024



పోరుబాటలో ఆదివాసీలు

ఆదివాసీలు పోరుబాటకు సై అంటున్నారు. ఐటీడీఏ పరిధిలో మెగా డీఎస్సీ నిర్వహించడంతోపాటు వివిధ డిమాండ్లతో నేడు మహాధర్నా నిర్వహించనున్నారు. 8లో▸



అందని 'సహకారం'

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా సబ్సిడీ యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ నిలిచిపోయింది. పంటల సాగు భారంగా మారుతోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం 34.0 /27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్‌: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో ప్రస్తుతం డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తృతీయ సంవత్సరం సెమిస్టర్‌- 6 చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయని కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు ఒరిజినల్ ఆధార్ లేదా ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. లేని పక్షంలో పరీక్షలు రాయడానికి అనుమతించమని పేర్కొన్నారు.

ప్రజలు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌: జిల్లాలో మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రజలు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో పాత ఇళ్లు, శిథిలావస్థకు చేరిన నివాసాల్లో ఉండేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాగులు, ఒర్రెలు ఉప్పొంగే రహదారుల మీదుగా ప్రయాణాలు మానుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లోని చెరువులు, నీటి వనరుల వైపు ప్రజలు వెళ్లొద్దన్నారు. జిల్లావ్యాప్తంగా 24 గంటల పాటు పోలీసులు, బ్లూకోట్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, విపత్కర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

నేటి నుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు

కైలాస్‌నగర్‌: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌(టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆన్‌లైన్ పరీక్షలు నేటి నుంచి ఈ నెల 29 వరకు జరుగనున్నాయి. ఆదిలాబాద్ పట్టణ శివారులోని నలంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానుండగా ప్రతీ రోజు ఉదయం 100, మధ్యాహ్నం 100 మంది చొప్పున పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావద్దని అధికారులు సూచించారు. పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి

కెరమెరి(ఆసిఫాబాద్‌): ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ను రద్దు చేసి నీట్ మళ్లీ నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ జాఫర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటి ముట్టడి చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీచార్జి చేసి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు మెహర్లే రాంచందర్, సెండే లక్ష్మణ్, వాడై తిరుపతి, సాయికుమార్, గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితో పని చేయాలి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్‌: బీజేపీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితో పని చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం పట్టణంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, దోని శ్రీశైలం, చన్కపురి గణపతి తదితరులు పాల్గొన్నారు.

వరదొస్తే.. అంతే!



కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై వంతెన వరదలకు కుంగి కూలిపోయింది. ఆ తర్వాత పైపులతో తాత్కాలిక రోడ్డు వేసి రాకపోకలు పునరుద్ధరించారు. శనివారం రాత్రి ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వరద ఉధృతికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దహెగాం, భీమిని మండలాల ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఆదివారం దహెగాం వైపు నిచ్చెనలు వేసి రాకపోకలు సాగించారు. వంతెన పూర్తి చేయకుంటే సోమవారం నిరవధిక ధర్నా చేపడతామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రకటించారు.



కెరమెరి మండలం లక్మాపూర్ వాగుపై 2016 సంవత్సరంలో వంతెన ప్రారంభించారు. పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వర్షాకాలంలో వాగుకు అవతలి వైపు ఉన్న సుమారు నాలుగు గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ప్రస్తుతం వరద కాస్త తక్కువగా ఉండటంతో ఎడ్లబండ్లపై బైక్‌లు దాటిస్తున్నారు. ప్రజలు సైతం ధైర్యం చేసి వరద నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే అనార్‌పల్లి వాగుపై కూడా వంతెన అసంపూర్తిగానే ఉంది. ఈ రెండు వంతెనలు పూర్తికాక సుమారు ఏడు గ్రామాల ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఇది ఆసిఫాబాద్ మండలం గుండి పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన. 2006లో అప్పటి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.3.60 కోట్లు మంజూరు చేసింది. 19 ఏళ్లవుతున్నా పిల్లర్లు మాత్రమే పూర్తయ్యాయి. రీటెండరింగ్‌లో భాగంగా మరోసారి రూ.3.25 కోట్లు మంజూరు చేశారు. పనులు పూర్తిచేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామస్తులు ఆందోళనలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. గుండి గ్రామంతోపాటు అటువైపు వారు జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. వరద పెరిగితే వీరు వాంకిడి మండలం మీదుగా 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది.

దహెగాం(సిర్పూర్‌): వానలు మొదలయ్యాయి. మోస్తరు వర్షాలకే వాగులు, ఒర్రెల్లో ప్రవాహం కనిపిస్తుంది. లోలెవల్ వంతెనల పైనుంచి వరద ప్రవహిస్తోంది. వర్షాకాలం ప్రారంభంలోనే జిల్లావాసులకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. ఏళ్లుగా పూర్తికాని వంతెనలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగితే పల్లెలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- వర్షాలకు వాగులు, ఒర్రెల్లో మొదలైన వరద
- అందవెల్లి వద్ద పెద్దవాగులో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- జిల్లాలో పలుచోట్ల అసంపూర్తిగా వంతెనలు
- ఏటా వానాకాలంలో తప్పని రవాణా కష్టాలు

ఏటా ఇదే పరిస్థితి

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 334 గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా పల్లెలకు రవాణా వ్యవస్థ మాత్రం మెరుగుపడటం లేదు. అధిక వర్షాలు పడితే ఇప్పటికీ అనేక గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నాయి. కనీసం అంబులెన్స్‌లు కూడా లేని పరిస్థితుల కారణంగా గర్భిణులు అవస్థలు పడుతున్నారు. 2021లో పెద్దవాగు వరదలకు అందవెల్లి వంతెన కుంగిపోతే మరమ్మతులు తీవ్ర జాప్యం చేశారు. ఫలితంగా గతేడాది వరదలకు వంతెనకు చెందిన నాలుగు పిల్లర్లు పూర్తిగా కూలిపోయాయి. మరమ్మతులకు సుమారు రూ.13.5 కోట్లు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. పిల్లర్లు, స్లాబ్ పనులు పూర్తయ్యాయి. వింగ్ వాల్‌లో మట్టిపోస్తే రాకపోకలు కొనసాగించవచ్చు. ఆదివారం ప్రజలు నిచ్చెనల సాయంతో రాకపోకలు సాగించారు. దహెగాం, భీమిని మండలాల ప్రజలు కాగజ్‌నగర్ మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగజ్‌నగర్ మీదుగా దహెగాం వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

అసంపూర్తిగా వంతెనలు

వాగులపై వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరైన వివిధ కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. పలుచోట్ల ఇప్పటికీ బ్రిడ్జీలు అంపూర్తిగా ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది.

- చింతలమానెపల్లి మండలంలో దిందా వాగుపై వంతెన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. నాయికపుగూడ వాగుపై వంతెన అసంపూర్తిగా ఉండడంతో సుమారు ఆరు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ప్రాణహిత నది ఉప్పొంగితే దిందా వాగులోకి బ్యాక్ వాటర్ వస్తుంది. రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. శివపల్లి, బూరెపల్లి, రణవెల్లి, శివపల్లి గ్రామాల మార్గంలో లోలెవల్ వంతెనల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.
- కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ సమీపంలో నందుప వాగుపై 2006లో వంతెన నిర్మాణం ప్రారంభించారు. అది ఇప్పటికీ అసంపూర్తిగా ఉంది. సుమారు ఆరు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతాయి. కాగజ్‌నగర్ పట్టణానికి రావాలంటే ఈ ప్రాంతం వారు కూడా వాంకిడి మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది.
- పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి, నాగులవాడ మధ్యలోని ఒర్రెపై వంతెన నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరయ్యాయి. అయినా పనులు ప్రారంభించలేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఒర్రె దాటాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.
- తిర్యాణి మండలం గోయెగాం గ్రామం వద్ద తలాండి వాగుపై రెండేళ్ల క్రితం డీఎంఎఫ్‌టీ నిధులతో వంతెన పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు పూర్తి చేసి మిగతా పనులు వదిలేశారు. సుమారు తలాండి, నాయికపుగూడ, దుగ్గాపూర్, కోయతలాండి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

లోలెవల్ వంతెన పైనుంచి వరద



గోయెగాం లోలెవల్ వంతెన పైనుంచి వరద

తిర్యాణి(ఆసిఫాబాద్‌): తిర్యాణి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం సుమారు గంటపాటు వర్షం కురిసింది. వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. గోయెగాం లోలెవల్ వంతెన పైనుంచి వరద వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

తీరని గోస



అందవెల్లి వంతెన కూలిపోవడంతో మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. శనివారం రాత్రి పడిన వానకు మళ్లీ వాగు వచ్చింది. రోడ్డు కొట్టుకుపోవడంతో ఇట్యాల నుంచి కాగజ్‌నగర్‌కు పోవడానికి పెంచికల్‌పేట్ మీదుగా 65 కిలోమీటర్లు ప్రయాణించాలి. ప్రతీ పనికి కాగజ్‌నగర్‌కు వెళ్లే మా గోస తీరడం లేదు.

– గుర్లె పోశన్న, ఇట్యాల, మం.దహెగాం

ఒక్క వానకే..



అందవెల్లి వంతెనలోని తాత్కాలిక రోడ్డు ఒక్క వానకే కొట్టుకుపోయింది. ప్రతీ పనికి కాగజ్‌నగర్ పోవాల్సి ఉంటది. పెంచికల్‌పేట్ మీదుగా పోతున్నాం. అక్కడ వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు కాలేదు. మట్టి పోసి ఉండటంతో బురదగా మారుతుంది. అందవెల్లి వంతెన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– గంధం రాజన్న, బీబ్రా, మం.దహెగాం

రైల్వే, రోడ్లకు తొలి ప్రాధాన్యత

- విద్య, వైద్య సౌకర్యాల మెరుగుకు ప్రత్యేక కృషి
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎంపీ గోడం నగేశ్



గోడం నగేశ్

కైలాస్‌నగర్‌: తనపై నమ్మకంతో గెలిపించిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి ఎంపీగా విజయం సాధించిన ఆయన సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' ఆయన్ను పలకరించగా ఈ ఐదేళ్ల పదవీ కాలంలో రైల్వే రంగంలో పెండింగ్ సమస్యలతోపాటు ప్రధాన రోడ్లను జాతీయ రహదారులుగా మార్చేలా తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. విద్య, వైద్యపరంగానూ పేదలకు భరోసా కల్పించడంతో పాటు కేంద్రం నుంచి వీలైనన్ని అధిక నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సాక్షి: ఆదిలాబాద్ ఎంపీగా మీ ప్రాధాన్యతలు ఏంటి?

ఎంపీ: రైల్వేరంగ సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యతాంశంగా పనిచేస్తా. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీ, ఆర్‌వోబీలను పూర్తి చేయించేందుకు కృషి చేస్తా. ఈ ప్రాంత ప్రజల చిరకాల కల అయిన ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు కొత్తగా రైల్వేలైన్ ఏర్పాటుకు అవసరమైన నిధులు విడుదల చేయిస్తా. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పలు ఆర్‌అండ్‌బీ పెద్ద రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తా. మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తా.

సాక్షి: విద్య, వైద్య పరంగా ఎలాంటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తారు?

ఎంపీ: పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా వైద్య సేవలు మరింత మెరుగుపరిచేలా కృషి చేస్తా. పార్లమెంట్ పరిధిలో మరో నవోదయ విద్యాలయంతో పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తా. విద్య, వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తా.

సాక్షి : ఎంపీగా, మంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మీపై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని ఏ విధంగా నెరవేరుస్తారు.

ఎంపీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నింటినీ పార్లమెంట్ పరిధిలోని వాసులకు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధవహిస్తా. ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన కేంద్రపరమైన అంశాలను ప్రధాని నరేంద్ర మోదీతో పాటు సంబంధిత శాఖల మంత్రులను కలిసి ప్రత్యేక నిధులు విడుదలయ్యేలా ప్రయత్నిస్తా.

సాక్షి: ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ(సీసీఐ) పునః ప్రారంభానికి ఎలాంటి కృషి చేయనున్నారు?

ఎంపీ: అదో పెద్ద సమస్య. దానిపై ఇప్పుడే ఏం మాట్లాడలేను. కేంద్ర ప్రభుత్వపరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి దానిపై దృష్టి సారిస్తా.

సాక్షి: జిల్లా కేంద్రంలో ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్, ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉంది. మీ హయాంలో అది సాకారమయ్యే అవకాశం ఉందా?

ఎంపీ: జిల్లా కేంద్రంలో రక్షణశాఖకు సంబంధించి 369 ఎకరాల భూమి ఉంది. మరో 1500 ఎకరాల భూ సేకరణకు సంబంధించిన ప్రతిపాదనలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా ఎన్‌వోసీ ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై సుముఖంగా ఉన్నందున ఎన్‌వోసీ వచ్చే అవకాశముంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రితో సత్సంబంధాలు ఉన్నందున ఈ విషయాన్ని ఆయన, ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి ఎలాగైనా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తా.

కాస్త ఉపశమనం

- రెండు రోజులుగా జిల్లాలో వర్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పెంచికల్‌పేట్(సిర్పూర్‌): వానాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. విత్తనాలు నాటి ఎదురుచూస్తున్న రైతులకు శనివారం, ఆదివారం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. జూన్ తొలివారం నుంచి జిల్లాలో సాగు పనులు ప్రారంభమయ్యాయి. చాలా మంది మంది రైతులు మృగశిర కార్తె ప్రారంభం తర్వాత పత్తి విత్తనాలు విత్తడం మొదలుపెట్టారు. దాదాపు 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో వారం ఇదే పరిస్థితి ఉంటే విత్తనాలు భూమిలోనే మాడిపోయేవి. ఈ క్రమంలో వర్షం పడటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జిల్లాలో 14.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వాంకిడిలో అత్యధికంగా 45.4 మి.మీ.ల వర్షపాతం నమోదుకాగా.. జైనూర్‌లో 37.06, లింగాపూర్‌లో 30.2, సిర్పూర్(యూ)లో 24.4, కెరమెరిలో 23.4, సిర్పూర్(టి)లో 23.4, రెబ్బెనలో 9.2 మి.మీ.ల వర్షం కురిసింది. కాగజ్‌నగర్, తిర్యాణి, ఆసిఫాబాద్, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లో ఐదు మి.మీ. వర్షపాతం నమోదైంది.



పెంచికల్‌పేట్‌లో పత్తి మొలకలను పరిశీలిస్తున్న యువరైతు

ఇంకా లోటే..

జిల్లాలోని పలు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే ఉంది. జూన్ 1 నుంచి 23వ తేదీ వరకు సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్ మండలాల్లో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షం కురిసింది. కెరమెరి మండలంలో సాధారణ వర్షపాతం ఉంది. ఇక వాంకిడి, ఆసిఫాబాద్, సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లో సాధారణ లోటు కనిపిస్తోంది. తిర్యాణి మండలంలో 70 శాతం, రెబ్బెన మండలంలో 62, కాగజ్‌నగర్ మండలంలో 68 శాతం లోటు ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

మూడెకరాల్లో సాగు



మూడెకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నా. రెండు వారాల క్రితం 9 పత్తి ప్యాకెట్లను చేనులో పాడి దుక్కిలో విత్తిన. అప్పటి నుంచి వర్షాల లేవు. రెండు రోజులుగా వర్షాలు పడుతుండటంతో విత్తనాలు మొలకెత్తుతాయి.

– పాలె శంకర్‌రావు, రైతు, ఎల్లూర్

సగం విత్తనాలే మొలకెత్తాయి



నాలుగెకరాల్లో పత్తి విత్తనాలు వేశా. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సగం పత్తి విత్తనాలు మాత్రమే మొలకెత్తాయి. పది రోజులుగా వానలు లేక విత్తనాలు భూమిలోనే ఉన్నాయి. సుమారు రూ.10వేల నష్టం వాటిల్లింది.

– లేగల నారాయణ, రైతు, ఎల్లూర్

ఆందోళన చెందొద్దు

గతేడాది కంటే జిల్లాలో ఈ సారి వర్షాలు ఆలస్యంగా కురుస్తున్నాయి. అన్నదాతలు ముందస్తుగా విత్తనాలు విత్తుకోవడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదు కావడంతో పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. భూమి తడిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి.నాటుకోవాలి.

– రాజులనాయుడు, ఏడీఏ

వృక్షశిలాజల సంరక్షణకు చర్యలు

పెంచికల్‌పేట్/కాగజ్‌నగర్‌రూరల్‌: కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల వృక్ష శిలాజాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్టు టైగర్ (ఎఫ్‌డీపీటీ) శాంతారాం అన్నారు. ఆదివారం పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి, లోడుపల్లి, కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని కడంబా అటవీ ప్రాంతాల్లో డైరెక్టర్ ఆఫ్ జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మంజూషా మహాజన్, సీనియర్ జియాలజిస్ట్ చక్రవర్తితో కలిసి పర్యటించారు. కొండపల్లి కంపార్టు నంబరు 150, లోడుపల్లి కంపార్టు నంబరు 20లో అతి పురాతన వృక్షశిలాజాలను పరిశీలించారు. వాటి వయస్సు, విచ్ఛేదన తీరును వారు అంచనా వేశారు. రానున్న రోజుల్లో డివిజన్‌లోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి టూరిజం అభివృద్ధి చేస్తామని అన్నారు. వారి వెంట ఎఫ్ఆర్వోలు సుధాకర్, రమాదేవి, డిప్యూటీ ఆర్వో ప్రభాకర్, ఎఫ్‌బీవో మహేశ్, సిబ్బంది ఉన్నారు.



వృక్ష శిలాజాలను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో మట్కా ఆడుతున్న అఫ్తాబ్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. ఇందిరా మార్కెట్‌కు చెందిన అఫ్తాబ్ హుస్సేన్ మట్కా ఆడుతూ పట్టుబడగా, ఏడు మట్కా చిట్టీలు, రూ. 800ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన కల్వచర్ల రాజుపై దాడి చేసిన రాచర్ల శ్రీనివాస్, శివలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. ప్రహరీగోడ విషయంలో వాగ్వాదం జరగడంతో దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటర్ చోరీ



బోర్ మోటర్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన కొండగుర్లె రాజ్‌కుమార్ అనే రైతుకు చెందిన రూ.20 వేల విలువ గల విద్యుత్ మోటర్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఆదివారం తెలిపారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ చేనులో బోర్‌కు బిగించిన విద్యుత్ మోటర్‌ను శనివారం రాత్రి దుండగులు దొంగిలించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ మోటర్లను దొంగలు వరుసగా చోరీలు చేసి అమ్ముకుంటున్నారని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. కౌటాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సిల్వర్ మెడల్



పతకంతో మహతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన వెరబెల్లి రవీందర్ రావు– ఉమాదేవిల కూతురు మహతి ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన 10మీటర్ల రైఫిల్ షూటింగ్ జూనియర్ మహిళా, జూనియర్ విభాగాల్లో రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయిలో రాణించిన మహతికి రాష్ట్ర మాజీ డీజీపీ అంజనీ కుమార్ మెడల్ అందించారు. మహతి ప్రస్తుతం పూణేలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది.

పోరుబాటలో ఆదివాసీలు

- ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్
- పట్టాల కోసం పోడురైతుల ఆందోళన
- గిరిపుత్రుల గోడు పట్టించుకోని ప్రభుత్వాలు
- నిరసనలకు పిలుపునిచ్చిన తుడుందెబ్బ
- నేడు ఐటీడీఏ ఎదుట 'మహాధర్నా'



ఉట్నూర్‌లో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): 'పోరాడితే పోయేదేమిలేదు.. బానిస సంకెళ్లు తప్ప' అనే నానుడిని పునికి పుచ్చుకున్న ఆదివాసీ నిరుద్యోగులు పోరుబాటకు సై అంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా తమ గోడును పట్టించుకోవడం లేదని ఆదివాసీ నిరుద్యోగులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు లేక కుటుంబాల పోషణ భారమవుతుందని, తమకు దక్కాల్సిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడుతున్నారు. ఇందుకు ఆందోళనలే శరణ్యమని నమ్మి ఉద్యమాల బాట పడుతున్నారు. ఆదివాసీ పోడు రైతులు సైతం ప్రభుత్వాల చర్యలతో రగిలిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పోరుబాటలో ఆదివాసీ నిరుద్యోగులతో జతకడుతున్నారు. ఇందుకోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో నేడు ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట మహాధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. గడిచిన వారం రోజులుగా ఆదివాసీ గ్రామాల్లో మహాధర్నాపై విస్తృత ప్రచారం నిర్వహించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులపై నిశ్శబ్దం

ఉట్నూర్ ఐటీడీఏలో సుమారు 1000 బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. కానీ ఇంత వరకు ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6459 మంది టీటీసీ, బీఎడ్ శిక్షణ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనరల్ డీఎస్సీ భర్తీ కోసం గిరిజన పోస్టులు 70 కూడా లేకపోవడం గమనార్హం. 2012లో నిర్వహించిన ఏజెన్సీ డీఎస్సీ తర్వాత ఇంత వరకు డీఎస్సీ నిర్వహించ లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గిరిజన ఆశ్రమ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో వేలల్లో ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. 2005 నుంచి ప్రారంభమైన సీఆర్టీ వ్యవస్థతోనే కాలం గడుపుతున్నారు తప్ప డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న చిత్తశుద్ధి లేకపోవడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఎక్కడికక్కడ నిరసనలు, ఉద్యమాలు చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. కానీ అధికారులు వీరి వినతులను చెత్తబుట్టల్లో పడేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లకు ఏళ్లుగా కోచింగ్ కోసం లక్షల రూపాయలు వెచ్చించి చదివిన చదువుకు అర్థం లేకుండా పోతుందని జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులు లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలు తగ్గాయని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ డీఎస్సీపైనే ఆశలు పెట్టుకున్నట్లు వారు పేర్కొంటున్నారు.

ఏజెన్సీ చట్టాలు నిర్వీర్యం..

5వ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. భూబదాలయింపు చట్టం 1/70 ఏజెన్సీలో ఎక్కడా అమలు కావడం లేదు. పెసా చట్టాన్ని సైతం నిర్వీర్యం చేస్తున్నారు. చట్టాల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. 317 జీవోతో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు ఉద్యోగాల్లో చేరడంతో స్థానికులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏజెన్సీ డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఆ మాట ఎత్తకపోవడం ఏంటని ఆదివాసీ నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు

- ఐటీడీఏలో మెగా డీఎస్సీ నిర్వహించాలి.
- బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.
- రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలి.
- మరోసారి పోడు సర్వే చేయించాలి.
- జీవో నెంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలి.
- ఏజెన్సీ పోస్టులను గిరిజనులతో భర్తీ చేయాలి.
- 1/70ని పకడ్బందీగా అమలు చేయాలి.
- పెసా చట్టాన్ని రక్షించాలి.

పట్టాలు ఇచ్చే వరకు పోరాటం



ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు నేటికీ పట్టాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదివాసీలకు పోడు పట్టాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తాం. ఆదివాసీ చట్టాలు, హక్కులను ఎక్కడికక్కడ నిర్వీర్యం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. హక్కుల రక్షణ కోసం రాష్ట్ర స్థాయిలో చర్చించి కార్యచరణ ప్రకటిస్తాం.

– కొడప నగేశ్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి



2012 తర్వాత నేటి వరకు ఐటీడీఏ ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించలేదు. దీంతో నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేలకు పైగా ఆదివాసీ నిరుద్యోగులు టీటీసీ, బీఈడీ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గతంలో చాలా సార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించాలి.

– పెందోర్ దీపక్, జైభారత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

పోడు పట్టాల కోసం నిరీక్షణ

ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నప్పటికీ ఆదివాసీలకు పోడు పట్టాలు అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 35 వేల హెక్టార్లలో సుమారు 12వేల మంది గిరిజన రైతులు పోడు భూములు సాగు చేస్తున్నారు. వీరికి పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పోడు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరుద్యోగులతో కలిసి పోరుబాట పట్టారు.

ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయాలి

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ నిర్వహించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని ఐటీడీఏ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్లతో సోమవారం తలపెట్టిన ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొమురంభీం కాలనీలో నిర్వహించిన సమావేశంలో సంఘ బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. జీవో 3 ప్రకారమే బదిలీలు, పదోన్నతులను కల్పించాలని, పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, 5వషెడ్యూల్ ప్రాంతంలో జీవో 317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు మేధావులు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

'ఆరుద్ర' ఆగమనం!



ఆరుద్రకార్తె శనివారం నుంచి ప్రారంభమైంది. ఆగమనంలోనే వాతావరణం చల్లబడింది. తొలకరి జల్లులు కురవడంతో అక్కడక్కడ పంట పొలాల్లో ఆరుద్ర పురుగుల రాక మొదలైంది. ఎరుపు రంగులో మెరిసిపోతూ, తాకితే మృదువుగా అనిపించే ఆరుద్ర పురుగులు దండేపల్లి సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం కనువిందు చేశాయి. – దండేపల్లి

అలరించిన 'అయోధ్యరామునికి నాట్యనీరాజనం'



అవార్డు అందుకుంటున్న నందిని నృత్యాలయ బృందం

మంచిర్యాలఅర్బన్: ఫ్రెండ్స్ ఇండియా కల్చరల్, సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి నృత్యోత్సవం అయోధ్యరామునికి నాట్య నీరాజనం ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగింది. జిల్లా నుంచి కళాకారులు హాజరై పలు అంశాలను ప్రదర్శించారు. మంచిర్యాలకు చెందిన నందిని నృత్యాలయ బృంద కళాకారులు అలోఖి, సాధిక, హర్షిత, మనస్వి, ఓజేస్వీ కూచిపూడినాట్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. కళాకారుల ప్రతిభకు అయోధ్య రామ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందించారు. సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, డాక్టర్ వేదాంతం రాదేశ్యాం, పశుమతి శేషుబాబు, దేవేంద్రపిళ్లై, ప్రభావతి తదితరులు హాజరయ్యారు.

'చట్టప్రకారం వేతనాలు చెల్లించాలి'



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు ఫ్యాక్టరీ చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం సంఘం బెల్లంపల్లి రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. సంస్థ అర్జించే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కీలకమని, అయినా వారికి వేతనాల చెల్లింపులో, లాభాల్లో వాటా చెల్లింపుల్లో వివక్ష చూపిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బ్రహ్మానందం, జాఫర్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనాలు

బెల్లంపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



దండేపల్లి: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



కొన్నేళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. బాల్య మిత్రులను ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులను నేర్పించిన గురువులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎక్కడెక్కడో వివిధ హోదాల్లో ఉన్న వారంతా కలుసుకొని జిల్లాలోని వివిధ మండలాల్లో అట్టహాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. 1996 –97లో బెల్లంపల్లి సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు, మందమర్రి పట్టణం మేదరిబస్తీలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 1986 –87లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998 –2000లో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003 –04లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు, జైపూర్ శ్రీచైతన్య హైస్కూల్‌లో 2008 –2009 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు.

– బెల్లంపల్లి/మందమర్రిరూరల్/ చెన్నూర్/ దండేపల్లి/జైపూర్



జైపూర్: శ్రీచైతన్య హైస్కూల్‌లో..



చెన్నూర్‌లో..



మందమర్రిరూరల్: 1986 -87లో ఏడో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు

రాడ్డు గుచ్చుకుని బాలుడు మృతి



రిశ్విత్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ఇంటి డాబాపై తోటి పిల్లలతో ఆడుకుంటున్న సమయంలో రాడ్డు పొట్టలో గుచ్చుకొని ఏడేళ్ల బాలుడు మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సరాండి గ్రామానికి చెందిన జాడి రషిక –భీంరావు దంపతుల కుమారుడు జాడి రిశ్విత్(7) గ్రామంలోని తోటి పిల్లలతో కలిసి ఆదివారం సాయంత్రం అదే గ్రామంలోని రషిక తండ్రి దుర్గం రమేశ్ ఇంటి డాబాపై ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో రిశ్విత్ ప్రమాదవశాత్తు మెట్ల దగ్గర జారి పడటంతో అక్కడున్న రాడ్డు పొట్టలో గుచ్చుకుంది. దీంతో తోటి పిల్లలు కేకలు వేయగా గమనించిన కుటుంబ సభ్యులు బాలుడుని వెంటనే వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన డాక్టరు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు ఆసిఫాబాద్‌లోని ఓ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. ఆడుకుంటూ బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన బాలుడి తల్లి రషిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

27 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు




మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని గ్రీన్‌సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 27 నుంచి 30 వరకు యూనిక్స్ సన్‌రైస్ పదో రాష్ట్రస్థాయి సీనియర్స్ మెన్, ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేసన్ వైస్ ప్రెసిడెంట్ బండ మీనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఈ టోర్నీకి 300 మంది వరకు క్రీడాకారులు, మ్యాచ్ రిఫరీలు, అంపైర్లు, పీడీలు వస్తారని, ఇందులో పాల్గొనే వారందరికీ వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 27న క్వాలిఫైడ్ మ్యాచ్‌లు, 28 నుంచి 30 వరకు మెయిన్ డ్రా మ్యాచులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సత్యపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు కృష్ణ, సీనియర్ క్రీడాకారులు రవి పాల్గొన్నారు.

ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



శేషరాం



ముజీబోద్దీన్

జన్నారం: జన్నారం ఫారెస్ట్ అటవీ డివిజన్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జన్నారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బీ.శేషరాం (ఎఫ్ఎస్‌వో, దొంగపల్లి), ఉపాధ్యక్షుడిగా లాల్‌బాయ్ (బీట్ అధికారి, మహ్మదాబాద్), ప్రధాన కార్యదర్శిగా ముజీబోద్దీన్ (బీట్ అధికారి, కలమడుగు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణారావు (సెక్షన్ అధికారి, కవ్వాల్), సంయుక్త కార్యదర్శిగా కృష్ణమూర్తి (బీట్‌అధికారి, మల్యాల్), కోశాధికారిగా అనిల్ (బీట్ అధికారి, దండెపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు అసోసియేషన్ జోనల్ కార్యదర్శి సుభాష్, సర్కిల్ రిప్రజెంటేటీవ్ అజార్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నేరడిగొండ: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ జవహర్‌లాల్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మేత మేసేందుకు బయటకు వెళ్లిన గేదె తెగి పడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో కరెంట్ షాక్ తగిలింది.

ట్రిపుల్‌ఐటీకి 15వేలకుపైగా దరఖాస్తులు



బాసర ట్రిపుల్‌ఐటీ

- గతేడాదితో పోలిస్తే సగానికి తగ్గుదల
- ఈ నెలాఖరు వరకు పరిశీలన పూర్తి
- జూలై 3న ఎంపిక జాబితా వెల్లడి
- 8, 9, 10 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన

భైంసా: 2024–25 విద్యాసంవత్సరానికి బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి జూన్ 1నుంచి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కళాశాలలో 1,500 సీట్లుండగా రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి 15వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు కళాశాల అధికారులు తెలిపారు. దరఖాస్తుల కచ్చిత సమాచారం త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పరిశీలించాకే ఎంపిక జాబితా

ఈనెలాఖరు వరకు దరఖాస్తులను పరిశీలించి ఎంపిక జాబితాను జూలై 3న ప్రకటిస్తామని ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను జూలై 8,9,10 తేదీల్లో పరిశీలించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

కోర్సు ఇలా..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో భాగంగా మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ తరగతులు బోధిస్తారు. పీయూసీలో వచ్చిన మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల బీటెక్ కోర్సులో వివిధ బ్రాంచ్‌లలో సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుంది. యూనిఫాంలు, షూస్, ల్యాప్‌టాప్ ఇస్తారు. విద్యార్థులు ఆటలు, కళలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తారు. కళాశాలలో ప్రత్యేక వైద్యశాల, అధునాతన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

సగానికి తగ్గిన దరఖాస్తులు

2020–21 విద్యాసంవత్సరంలో 32వేల మంది, 2021–22లో 20,178, 2022–23లో 31,432 మంది, 2023–24 విద్యాసంవత్సరంలో 32,635 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య సగానికి తగ్గింది.